epaper.manachourasta.com

మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 02 | సంచిక : 171 | ఆదివారం, 16 నవంబర్ 2025 | పేజీలు : 04



# తెలంగాణలో చేప పిల్లల వర్షం

- మత్స్యకారులకు భారీగా లాభం
- 26 వేల చెరువులు 84 కోట్ల చేప పిల్లలు
- 10 కోట్ల రొయ్యల పంపిణీ

**హుస్నాబాద్, మన చౌరస్తా:**

రాష్ట్రంలో మత్స్య సంపద పెంపు దిశగా చేపట్టిన చేప పిల్లల పంపిణీ కార్యక్రమం శుక్రవారం హుస్నాబాద్‌లో సందడి చేసింది. ఎల్లమ్మ చెరువులో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కలిసి 5.17 లక్షల రూపాయలతో 3 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ పంపిణీతో చెరువు పరిధిలోని 253 మంది మత్స్యకారుల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. రాష్ట్రవ్యాప్తంగా 26 వేల చెరువుల్లో 84 కోట్ల చేప పిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలను ఉచితంగా విడుదల చేస్తున్నట్టు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పారదర్శకత కోసం చేప పిల్లల సైజు, సంఖ్య, సరఫరా వివరాలు చెరువుల వద్ద సైన్‌బోర్డుల రూపంలో ఉంచుతున్నామని పేర్కొన్నారు.

## నియోజకవర్గానికి 38.92 లక్షలు..

హుస్నాబాద్ నియోజకవర్గంలోని 165 చెరువులకు మొత్తం 38 లక్షల 92 వేల చేప పిల్లలు పంపిణీ చేయనున్నారు. దీంతో 4,144 మంది మత్స్యకారుల కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. మహిళా సంఘాలకు అందించిన మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లు, మత్స్యకారుల కోసం అమలు చేస్తున్న 5 లక్షల గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ వంటి అంశాలను అధికారులు గుర్తు చేశారు.

## హుస్నాబాద్‌కు ఆధునిక వసతులు

కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్, హుస్నాబాద్ పశువైద్యశాలను ఆధునీకరించడం, ఫిష్ మార్కెట్‌ను పూర్తి చేయడం, వెటర్నరీ డాక్టర్ పోస్టు భర్తీ, స్టోరేజ్ సెంటర్, పాల శీతలీకరణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీహరికి విజ్ఞప్తి చేశారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి శ్రీహరి ఇవన్నీ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. గురుకులాల్లో మెనూలో చేపలను చేర్చే అంశాన్ని త్వరలో అమలు చేస్తామని చెప్పారు.

## రేవంత్ ప్రోత్సాహంతోనే..

మత్స్య శాఖకు సీఎం రేవంత్ రెడ్డి రూ.123 కోట్లు కేటాయించారని, చేప పిల్లల పంపిణీ కార్యక్రమం రాష్ట్రంలో పెద్ద ఎత్తున సాగుతోందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం చేప ఉత్పత్తి కేంద్రాలను పెంచి ఇతర రాష్ట్రాలకూ సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హైమవతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మలా జయరాజ్, సింగిల్ విండో చైర్మన్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.



## కమీషన్ల.. కడియం..!

- మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య

3 లో



# నవ భారత నిర్మాణత సర్దార్ వల్లభాయ్ పటేల్

- జనగామలో యూనిటీ మార్చ్
- ప్రారంభించిన కలెక్టర్ రిజ్వన్ బాషా

**జనగామ, మన చౌరాస్తా :** నవభారత నిర్మాణం కోసం నిరంతరం కృషి చేసిన మహా వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని, ఆయన అడుగుజాడల లో ప్రతి ఒక్కరూ పయనించాలని జిల్లా కలెక్టర్ రిజ్వన్ బాషా అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్క్ ఆవరణంలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ వరంగల్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వన్ బాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్, భరతమాత చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి, ఐక్యత పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశంలో స్వేచ్ఛ కోసం తపించేవారని, ఎన్ని భాషలు మాట్లాడిన ఎన్ని ప్రాంతాలు ఉన్న మనమందరం ఒకటేనని చాటి చెప్పేవారని వివరించారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత కూడా సంస్థానాలుగా విడివిడిగా ఉన్న దేశాన్ని ఒక్కటి




చేయడంలో సర్దార్ పటేల్ కృషి చేశారన్నారు. భారత దేశ ప్రజల్ని చైతన్యపరిచి ఏకతాటిపై నడిపించిన మహనీయుడని కొనియాడారు. ప్రజలు ఆయన ఆశయ సాధన కోసం పని చేయాలన్నారు. భారతదేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడానికి ప్రతి పౌరుడు దేశీయ ఉత్పత్తులను ఉపయోగించుకోవాలని, దేశానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిచే ఐక్యత (ఆత్మ నిర్భర్భారత్) ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మేరా యువ భారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, జనగామ ఆర్డీవో గోపీరామ్, తహసీల్దార్ హుస్సేన్, మేర భారత్ జనగామ వాలంటీర్ హరీష్ , నామినేటెడ్ సభ్యులు రమేష్ అంజిరెడ్డి, శశిదర్ రెడ్డి, సూపరిండెంట్ బానోతు దేవిలాల్, మై భారత్ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సీసీ వలంటీర్లు, నామినేటెడ్ సభ్యులు శశిధర్ రెడ్డి, అంజిరెడ్డి, రమేష్, మహిళా సంఘ సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.









## కాంట్రాక్టర్లను వదిలిపెట్టం

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జిల్లా కలెక్టర్, ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పాలకుర్తి సోమేశ్వరాలయంలో కాంట్రాక్టర్లు బకాయిలు వదిలి పెట్టమని, నోటీసులు ఇచ్చి వసూలు చేస్తామని దేవస్థానం ఈవో భాగం లక్ష్మీప్రసన్న తెలిపారు. దేవాలయంలో అన్ని నిబంధన ప్రకారమే జరుగుతున్నాయని, బకాయిదారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ మౌఖిక ఆదేశాల మేరకు మరొక్కసారి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తామన్నారు. కేసు నమోదు అయ్యాక కోర్టు ద్వారానైనా బకాయిలు వసూలు చేస్తామని, ఇందులో ఎలాంటి అపోహలకు తావులేదని చెప్పారు.

## ఉప్పుగల్‌లో ప్రజాభిప్రాయ సేకరణ

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం వరంగల్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అధ్యక్షతన జాఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జనగామ జిల్లాలో ఉన్నా సుస్త్రో స్పెషాలిటీ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ శనివారం రోజున పరిశ్రమ అవరణలో చేపట్టారు. ప్రస్తుత యూనిట్ లో ప్రతిపాదించిన సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్ విస్తరణ ప్రాజెక్టుపై ప్రజల అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలు సేకరించారు. ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఆడియో, వీడియో, వ్రాతపూర్వకంగా వచ్చిన సూచనలతో పాటు భారత ప్రభుత్వ పర్యావరణ అటవీ, వాతావరణ పరివర్తన మంత్రిత్వశాఖకు తదుపరి చర్యలు తీసుకోవడానికి పంపిస్తామని ఈఈ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజినల్ ఆఫీస్ వరంగల్ తెలిపారు. అదనపు కలెక్టర్ బెన్ షా లోమ్, ఆర్డీవో వెంకన్న, ఇన్చార్జి తహసీల్దార్ రాజేష్ పాల్గొన్నారు.






## గ్రంథాలయాలు.. విజ్ఞానానికి నిలయాలు

- డీపీఆర్వో రాజేంద్రప్రసాద్

**మహబూబాబాద్, మన చౌరాస్తా :** గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని మహబూబాబాద్ డీపీఆర్వో పసునూరి రాజేంద్రప్రసాద్ అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డీపీఆర్వో ముఖ్య అతిథిగా హాజరై పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుస్తకాలు జ్ఞానాన్ని అందిస్తాయని, అటువంటి విజ్ఞానమే ప్రామాణికంగా మానవతా హృదయాన్ని అందించే గ్రంథాలయాలు సమాజానికి గుండెకాయ లాంటివని పేర్కొన్నారు. ప్రపంచాన్ని మార్చే శక్తి పుస్తకానికి మాత్రమే ఉందని, మంచి వ్యక్తిత్వం పుస్తకాల ద్వారా మాత్రమే ఏర్పడుతుందని, బాల్యం నుంచే చదువుతో పాటు పుస్తక పఠనం పట్ల పిల్లల్లో ఆసక్తి పెంచితేనే విజ్ఞానవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు.ఈ పుస్తక ప్రదర్శనలో బాల సాహిత్యం, ఆధ్యాత్మిక సాహిత్యం, అభ్యుదయ సాహిత్యం, ప్రగతిశీల సాహిత్యం, రెఫరెన్స్, నవలలు, దేశ నాయకుల చరిత్రలు, నిఘంటువులు, పోటీ పరీక్షలకు సంబంధించిన అకాడమీ పుస్తకాలను ప్రదర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాలకుడు జి. విజేందర్, సి.హెచ్ రవి, రుద్రారపు వీరేందర్, బొడ్డుపల్లి భూలక్ష్మి, బి.యాదమ్మ, గ్రంథాలయ పాఠకులు ముఖేష్, శ్రీకాంత్ శారద, దేవ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



## జనగామలో ప్రత్యేక లోక్ అదాలత్

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్‌పర్సన్, ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ కక్షిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రత్యేక లోక్ అదాలత్ అందరూ ఉపయోగించుకోవాలన్నారు. ఇరు పక్షాలు ఏదో క్షణిక ఆవేశంతో కొట్లాడుకొని ఒకరిపై ఒకరు కేసులు కేసులు పెట్టుకోవడం, ఆస్తి తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, భార్యాభర్తల తగాదాలు, చిన్నచిన్న రాజీ పడ తగాదాలు ఈ ప్రత్యేకత లోకదాలత్లో పరిష్కరించబడతాయని తెలిపారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ.. ఇరుపక్షలు కొట్లాడుకోకుండా పరిష్కరించుకుంటే మీతో పాటు మీ ఊరు కూడా ప్రశాంతంగా ఉంటుంది అని అన్నారు.



# కమీషన్ల.. కడియం..!

- అందుకే ఎస్టిమేషన్లు పెంచుతున్నడు
- స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఆయన చేసిందేమీ లేదు
- మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య



**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** కమీషన్ల కోసమే ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎస్టిమేషన్లు పెంచుతున్నారని, ఎస్టిమేషన్లు వేస్తూ, కాలం గడుపడం తప్ప స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి ఆయన చేసిందేమీ లేదని మాజీ డిప్యూటీ సీఎం, బీఆర్ఎస్ నేత తాటికొండ రాజయ్య విమర్శించారు. ఉప్పుగల్ రిజర్వాయర్ మెయిన్స్ కెనాల్ రూ.470 కోట్లతో అయిపోయే పనిని కమిషన్ల కోసం రూ.1,100 కోట్లకు పెంచాడని, ఆ పనిని ఆయన బినామీకే ఇచ్చుకున్నాడని ఆరోపించారు. కడియం శ్రీహరి అహంకారంతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి ఒక రాక్షసుడిలా మారి ఆయన, ఆయన కుటుంబం దోచుకుంటున్నారు. 'అన్ని కోట్లు తెచ్చిన ఇన్ని కోట్లు తెచ్చిన అని అబద్ధాలు చెప్తూ ప్రజలను మోసం చేస్తున్న కడియం శ్రీహరికి కనువిప్పు కలిగేలా ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేలా పాదయాత్ర చేస్తాం. ఆయన మోసాన్ని ప్రజలకు అర్థం అయ్యేలా చేస్తాం..' అని రాజయ్య అన్నారు. నీకు దమ్ముంటే ఈ 2 సంవత్సరాలతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి ఏం చేశావో చెప్పు అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో కడియం శ్రీహరి అనుచరుల ఆగడాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, జూబ్లీహిల్స్ ప్రజల నిర్ణయాన్ని శిరసావహిస్తామని, జూబ్లీహిల్స్ ఓటమితో బీ ఆర్ ఎస్ పార్టీ మరింత బాధ్యతాయుతంగా ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తామని రాజయ్య చెప్పారు. ఒక్క ఉప ఎన్నిక కోసం కాంగ్రెస్ పార్టీ నాయకత్వం అంతా అక్కడే మకాం వేయాల్సిన పరిస్థితి వచ్చింది అంటేనే వారి పాలన పై ఎంత నమ్మకం ఉందో అర్థం అయింది. ఏదేమైనా ఇంకో 500 రోజులలో మన బీ ఆర్ ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుంది, మళ్లీ మన నాయకులు కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతారు. ఇటీవలే వెస్ట్ బెంగాల్ హైకోర్టు లో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యే పై అనర్హత వేటు వేయడం జరిగింది, అదే విధంగా రాబోవు కాలంలో తెలంగాణ లో కూడా అదే జరుగుతుంది. కడియం శ్రీహరి అబద్ధాలతో కాలం గడుపుతున్నాడు, అభివృద్ధి శూన్యం మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయి. మరి కొన్ని రోజులలో స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయి, బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలందరూ సంసిద్ధులుగా ఉండాలి . ప్రజలంతా కెసిఆర్ వైపు చూస్తున్నారు. మనం 10 సంవత్సరాలు చేసిన అభివృద్ధిని చెప్పుకొని ప్రజల్లోకి వెళ్ళాలని తాటికొండ రాజయ్య పిలుపునిచ్చారు.



## వధూవరుకు ఝాన్సీరెడ్డి ఆశీర్వాదం

**పాలకుర్తి, మన చౌరాస్తా :** మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్ లో ముత్తారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ భాస్కర్‌చెల్లి మానస వివాహ మహోత్సవం జరిగింది. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలుపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, యాకాంతరావు, కుస భాస్కర్, నల్ల మాస రమేష్, గోనే అశోక్ పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గోవిందాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో, రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యాన్ని తొందరగా తూకం వేసి రైస్ మిల్లులకు పంపాలన్నారు. రైతులు తమ ధాన్యంపై టార్పాలిన్స్ కవర్స్ కప్పే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ట్యాబ్ లో రైతుల వివరాలు నమోదు చేసి వారి అకౌంట్లో తొందరగా డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేస్తూ మిల్లులకు తరలించాలని తూకం విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు.

క్రమపద్ధతిలో తూకం వేస్తూ మిల్లులకు తరలించాలని రైతులు నియమాల ప్రకారం.. తేమ శాతం వచ్చేలా చూడాలని సూచించారు. ధాన్యాన్ని ప్యాడి క్లీనర్లలో శుభ్రం చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఎఓ అనురాధ, డిఎం సివిల్ సప్లైస్ సంధ్యారాణి, డి ఎస్ ఓ కిష్టయ్య, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.



## వరంగల్‌లో రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ పర్యాటన

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారిని శనివారం జిల్లా కలెక్టర్ డా. సత్య శారదా , డీసీపీ అంకిత్ కుమార్ కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో మైనారిటీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల పురోగతి, ప్రయోజనాలు, అలాగే భవిష్యత్ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. మైనారిటీ విద్య, ఉపాధి సదుపాయాలు, నిధుల విడుదల, పారదర్శక అమలు వంటి అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు.జిల్లాలో అమలవుతున్న పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్ , సి.ఎం. ఓవర్ సిస్ పథకాలు తీరు, మైనారిటీ రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూట్ లలో అమలు అవుతున్న కామన్ మెనూ డైట్ , ఇతర వసతులు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా కుట్టు మిషన్ల లబ్దిదారుల ఎంపిక, గ్రాండ్ ఎయిడ్ కింద అభివృద్ధి పనులు అభివృద్ధి పనులను సమర్ధవంతంగా అమలు చేయడంపై కలెక్టర్ డా. సత్య శారదను ఆయన అభినందించారు.

## చెరువుల ప్రాముఖ్యతను గుర్తించండి

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

**హనుమకొండ, మన చౌరాస్తా :** జిల్లాలోని చెరువులు, కుంటల ప్రాముఖ్యతను గుర్తించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సాగునీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఫారెస్ట్ అధికారి లావణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో తడి నేలలు (వెట్ ల్యాండ్స్ )ను గుర్తించి వాటి పరిరక్షణకు త్వరగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం కోసం బుధవారం నాటికి నివేదికను సాగునీటిపారుదల అధికారులు అందజేయాలన్నారు. జియో శాటిలైట్ ఇమేజెస్ ద్వారా జిల్లాలో 267 చెరువులు, కుంటలు గుర్తించబడ్డాయని అన్నారు. జాబితాలో ఉన్న మేరకు 267 చెరువులు, కుంటలను స్థానిక పంచాయతీ కార్యదర్శితో పాటు సాగునీటిపారుదల శాఖ అధికారులు సందర్శించి వివరాల నివేదికను సమర్పించాలన్నారు. ప్రాధాన్యత క్రమంలో వంద ఎకరాల విస్తీర్ణం కలిగిన జిల్లాలోని 11 చెరువులను సాగునీటి పారుదల శాఖ డీఈ లు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత ఫార్మట్ లో సమగ్ర వివరాలను అందజేయాలన్నారు. చెరువులు, కుంటలు ఉన్న భూములు ఎలాంటివి, నీటి సామర్థ్యం ఎంత, అక్కడి ప్రత్యేకతలు, తదితర అంశాలను తెలియజేస్తూ నివేదికను అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి లావణ్య సర్వే కు సంబంధించిన అంశాల గురించి అధికారులకు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, సాగునీటిపారుదల డిఈ రామ్మోహన్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## 30న గొర్రెల మేకల పెంపకదారుల మహాసభ



**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి మండల గొర్రెల మేకల పెంపకందారుల సంఘం (జి ఎం పి ఎస్) జిల్లా మహాసభ ఈనెల 30వ తేదీన జనగాం జిల్లా కేంద్రంలో నిర్వహించే మహాసభ జయప్రదం చేయాలని సంఘం నాయకులు కోరారు. మండల అధ్యక్షుడు అధ్యక్షులు బైకాని ఐలేష్ పాలకుర్తి గొర్రెల మేకల పెంపకం దారుల మండల కమిటీ సమావేశం శనివారం పాలకుర్తి మండల కేంద్రంలో నిర్వహించారు. సమావేశం బైకాని ఐలేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు నకిర్త యాకన్నా, జిల్లా కార్యదర్శి సాదం రమేష్ లు పాల్గొని మాట్లాడుతు గొర్రెల మేకల పెంపకందారుల సంఘం(జిఎంపిఎస్ ) జిల్లా మూడో మహాసభ జనగామ జిల్లా కేంద్రంలోని కామాక్షి పంక్షన్ హల్ లో జరుగుతుంది అని తెలిపారు. మహాసభ కార్యక్రమము నకు సంఘ సభ్యులు ప్రతినిధులు పెద్దఎత్తున కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జిట్టబోయిన రమేష్, ఐలయ్య, యుగంధర్ పాల్గొన్నారు

# అది నకిలీ ఫేస్‌బుక్ ఖాతా!

- **వచ్చే మెసేజ్‌లను నమ్మొద్దు**
- **హైదరాబాద్ సీపీ సజ్జనార్**



**హైదరాబాద్, మన చౌరాస్తా :** తన పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీ ఫేస్‌బుక్ (Facebook) ఖాతా సృష్టించారని హైదరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. ఆపదలో ఉన్నానని, డబ్బులు పంపాలని మోసపూరిత మెసేజ్‌లు పంపిస్తున్నారని చెప్పారు. ఈ మెసేజ్ నిజమని నమ్మిన ఓ స్నేహితుడు రూ.20 వేలు పంపి మోసపోయారని తెలిపారు. డబ్బులు పంపాలని వచ్చే మెసేజ్‌లను ఎవరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద లింక్‌లు, మెసేజ్‌లు, వీడియో కాల్స్ వస్తే బ్లాక్ చేయాలని సూచించారు. ఆయా సైట్లు బ్లాక్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నాని ఎక్స్ వేదికగా సూచించారు.

'నా పేరుతో ఫేక్ ఫేస్‌బుక్ ఖాతాలు సృష్టించి, నా స్నేహితులకు 'నేను ఆపదలో ఉన్నాను. డబ్బులు పంపించండి' అని సైబర్ నేరగాళ్లు సందేశాలు పంపిస్తున్నారు. దురదృష్టవశాత్తు, నిజమే అనుకుని నా స్నేహితుడు ఒకరు రూ.20,000 ను మోసగాళ్ల ఖాతాకు పంపారు. నా వ్యక్తిగత ఫేస్ బుక్ పేజీ లింక్ ఇది.. https://facebook.com/share/1DHPndApWj/. ఇది మినహా నా పేరుతో ఉన్న మిగతా ఖాతాలన్నీనకిలివే. ఈ ఫేక్ ఖాతాలను మెటా సహకారంతో హైదరాబాద్ సైబర్ క్రైం టీం తొలగించే పనిలో ఉంది. నా పేరుతో, లేదా ఏ అధికారి/ప్రముఖ వ్యక్తి పేరుతో ఫేస్ బుక్‌లో వచ్చే రిక్వెస్ట్‌లను స్పందించకండి. డబ్బులు పంపాలని వచ్చే సందేశాలను అసలు నమ్మకండి. ఒకవేళ అలా ఎవరైనా మెసేజ్‌లు చేస్తే.. ముందుగా ఫోన్ ద్వారా వ్యక్తిని స్వయంగా సంప్రదించి పరిశీలించండి. అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లు, వీడియో కాల్‌లను వెంటనే బ్లాక్ చేసి రిపోర్ట్ చేయండి. సైబర్ మోసాలను వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా http://cybercrime.gov.in లో రిపోర్ట్ చేయండి. మనమంతా జాగ్రత్తగా ఉంటేనే.. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా మనల్ని, మన డబ్బును కాపాడుకోగలం.' అని సజ్జనార్ ట్వీట్ చేశారు.

# టెన్నికాయిట్ పోటీలు ఎంపికలు

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండలోని ఐడియల్ స్కూల్ గ్రౌండ్స్ లో తొమ్మిదవ ఉమ్మడి జిల్లా స్థాయి టెన్నికాయిట్ సెలక్షన్స్ శనివారం నిర్వహించారు. హైదరాబాదులో జరిగే జూనియర్స్ అండర్ 17 రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలో జరగనుండగా ఈ రోజు ఉమ్మడి జిల్లాలోని హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, మహబూబాద్, జనగామ, ములుగు జిల్లాల నుంచి సుమారు150 మంది బాలబాలికల క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి వెళ్లే క్రీడాకారులు

**హనుమకొండ జిల్లా నుంచి :** పునీత్ కుమార్, బన్నీ, సాయి ప్రణీత్, అనుదీప్, బాలికలు: నవ్య, నవీన, అనుష్క, సపురా.

**వరంగల్ జిల్లా నుంచి :** సాయి తేజ, సోహెల్, కార్తీక్, ప్రీతం, మానస నిస్సి జ్యోతి సంధ్య.

**జనగామ జిల్లా నుంచి :** బాలబాలికలు : ప్రణయ్, రితీష్, అభిలాష్, పవన్, షణ్ముఖ శేష్మిక , పవిత్ర నంద, అక్షర.

**ములుగు జిల్లా నుంచి :** శమంత్, ఆకాష్, అన్షు, వశీకర్, మనిధర్, శరణ్య, శ్రీజ, హర్షిత, సౌమ్యశ్రీ.

మహబూబాబాద్ బాలబాలికలు : గౌతమ్, శ్రీశాంత్, విగ్నేష్, సాంబ, సోహ, అరుబానాజ్, అక్షిత, లక్ష్మీ ప్రసన్న.

**భూపాలపల్లి జిల్లా నుంచి :** సందీప్, హేమంత్, అక్షిత్ రామ్, షాజీమా దిల్షాద్, సాక్షిత, మీనాక్షి, ఝాన్సీ.

వీరంతా రాష్ట్రస్థాయి బాలబాలికల పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి టెన్నికాయిట్ రాష్ట్ర కోశాధికారి అల్వాల రాజకుమార్, వరంగల్ జిల్లా టెన్నికాయిట్ కార్యదర్శి గోకారపు శ్యాం కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారి జహూర్, అతిథులు ఐడల్ స్కూల్ విద్యాసంస్థల యాజమాన్యం ఫిరోజుద్దీన్ సర్ఫరాజుద్దీన్, పిఈటి పాషా, సీనియర్ టెన్నికాయిట్ క్రీడాకారులు పవన్ సాయి కౌశిక్ అర్జున్ దేవేందర్ మధు వివిధ జిల్లాల పాఠశాలల పిఈటిలు పాల్గొన్నారు.

# శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేయాలి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** మంగళపల్లి గ్రామానికి చెందిన బసవేణి శ్రీనివాస్ ఇటీవల మంగళపల్లి స్టేజీ వద్ద టిప్పర్ వాహనం ఢీకొట్టడంతో మృత్యువాతపడ్డ విషయం తెలిసిందే. పేద కుటుంబానికి చెందిన శ్రీనివాస్ మరణంతో వారి కుటుంబం విషాదంలో మునిగిపోయిందని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల పనుల కోసం బైరాన్ చెరువు వద్ద గుట్ట తవ్వకాలు చేపట్టగా, ఆ మట్టిని నేషనల్ హైవే నిర్మాణానికి కాంట్రాక్టరు తరలించే క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ దుర్ఘటనకు సంబంధించి ప్రభుత్వం, నేషనల్ హైవే కాంట్రాక్టర్ పూర్తిస్థాయి బాధ్యత వహించాలని రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. వారి కుటుంబంలో అర్హులైన సభ్యునికి ప్రభుత్వ ఉద్యోగం, అదనంగా ₹50 లక్షల తక్షణ పరిహారం అందించాలని బీఎస్పీ పార్టీ తరఫున విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిపారు. టిప్పర్ వాహనాలు నడిపే డ్రైవర్లను నిద్ర లేకుండా అదనపు పనులు చేయించడం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే ఇలాంటి ప్రమాదాలకు కారణమని ఆయన విమర్శించారు. శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేయకపోతే బీఎస్పీ పార్టీ పక్షాన దీక్షతో పోరాటం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు హనుమంతు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





# మెగా మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

- **మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు**

**ఎల్కతుర్తి, మన చౌరాస్తా :** హుస్నాబాద్ నియోజకవర్గంలో ఈ నెల 17వ తేదీన ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న మెగా మెడికల్ క్యాంప్ కోసం జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం స్వయంగా పరిశీలించారు. కాకతీయ మెడికల్ కాలేజీ వైద్య బృందం సహకారంతో నిర్వహించనున్న ఈ మహా వైద్య శిబిరంలో సాధారణ వైద్యం,(మహిళా వైద్యం), శిశు, నేత్ర, దంత, ఎముకలు, చర్మ, హృదయ, మధుమేహం-రక్తపోటు వంటి అన్ని కీలక విభాగాల నిపుణులైన స్పెషలిస్ట్ డాక్టర్లు సేవలు అందుబాటులో ఉండనున్నాయి. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల కట్టుబడి ఉందని మంత్రి ప్రభాకర్ పేర్కొన్నారు. శిబిరం కోసం మౌలిక సదుపాయాలను, వైద్య పరికరాల ఏర్పాటు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, మందుల పంపిణీ కేంద్రాలను మంత్రి సమీక్షించారు. "ఎల్కతుర్తి మండలంలో జరిగే ఈ మెగా మెడికల్ క్యాంప్ హుస్నాబాద్ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది," అని మంత్రి అన్నారు






# క్రీడలతో మానసికోల్లాసం

- **ఆర్టీఏ మెంబర్ అభిగౌడ్**

**జనగామ, మన చౌరాస్తా :** క్రీడలతో మానసికోల్లాసం చేకూరుతుందని ఆర్టీఏ మెంబర్ చిలువేరు అభిగౌడ్ అన్నారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని నారాయణ స్కూల్‌లో ఇ-కిడ్స్ విద్యార్థులకు ఎన్‌పీఎల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అభిగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమని, అందులో నారాయణ స్కూల్ వారు ఎన్‌పీఎల్ (నారాయణ ప్రీమియర్ లీగ్) పేరుతో విద్యార్థులకు వివిధ క్రీడలు ఏర్పాటు చేసి వారిని శారీరకంగా ధృడంగా , మానసికంగా ఉల్లాసంగా ఉంచడం కృషి చేయడం అభినందనీయం అన్నారు. దీని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఫర్హానా, ఏవో ఎండీ.అన్వర్, డీన్ విక్రమ్, ఇ-కిడ్స్ వీపీ శ్రీలేక, పీఈటీ మహేష్, ఇ-చాంప్స్ వీపీ రేణుక, స్కిల్స్ టీచర్స్ వీణావాణి, ఉపాధ్యాయులు మమత, అనిత విద్యార్థులు పాల్గొన్నారు.





**రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఆర్టీఏ మెంబర్ చిలువేరు అభిగౌడ్ గారి ఆధ్వర్యంలో పట్టణంలోని సెయింట్ పాల్స్, నారాయణ, ఎస్‌పీఆర్, ఏకశిల వ్యాసరచన పోటీని నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు అభిగౌడ్ బహుమతులు అందజేశారు.**